# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 98 EDITOR:CHERUKU UPENDAR, DATE : FRIDAY 11 AUGUST 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 98 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శుక్రవారం 11 ఆగస్టు 2023 పేజీలు : 4 వెల : 5/-


## చంద్రుడి దగ్గరకు చంద్రయాన్...



బెంగళూరు- ప్రభాత సూర్యుడు

చంద్రయాన్-3 స్పేస్‌క్రాఫ్ట్ చంద్రునికి మరింతగా చేరువైంది. బుధవారం రోజు కక్ష్య మార్పుతో ప్రస్తుతం చంద్రయాన్-3.. 174 కి.మీ 1,437 కి.మీ కక్ష్యలో పరిభ్రమిస్తోంది. తదుపరి కక్ష్య మార్పు ఆగస్టు 14వ తేదీన

మిగతా 2లో...

## తెలంగాణలో... పించను రాజకీయం..!




### తాయిలాలు వదిలేస్తున్న కేసీఆర్



నల్గొండ- ప్రభాత సూర్యుడు

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అమాంతం పెన్షన్ల పాట పెంచేశారు. వృద్ధులు, బీడీ కార్మికులు, వితంతువులు తదితర వర్గాలకు ఇస్తున్న సంక్షేమ పెన్షన్ ను రూ. 5 వేలు చేస్తామని ఆయన శాసనసభలో వెల్లడించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఈ విషయం పొందుపరుస్తామని చెప్పారు. ప్రజలను ఆకట్టుకోవడానికి తమ వద్ద ఇలాంటి అస్త్రాలు ఇంకా చాలా ఉన్నాయని వాటిని ఒక్కొక్కటిగా బయటకు తీస్తామని కెసిఆర్ అంటున్నారు.ప్రజలను ఆకట్టుకోవడానికి, ఓటు బ్యాంకులను పటిష్టంగా నిర్మించుకోవడానికి పెన్షన్లు ఒక రాజమార్గం లాగా రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. వితంతు, వృద్ధాప్య, వికలాంగ పెన్షన్లు ఇవ్వడంలో ఉదారంగా ఉంటే లబ్ధిదారుల కుటుంబాలన్నీ కూడా తమకు రుణపడి ఉంటాయనే ఆలోచనతో పార్టీలు వ్యూహరచనలు చేసుకుంటున్నాయి. అందుకే ఒకప్పట్లో వంద రూపాయలు ఉన్న వృద్ధాప్య పెన్షన్ అనేది 30 రెట్లు పెరిగి ఇవాళ మూడు వేల రూపాయల వరకు చేరుకుంది. ప్రతి ఐదు ఏళ్లకు ఒకసారి ఈ పెన్షన్లు పెరుగుతూ పోయే అవకాశం కూడా కనిపిస్తుంది.గత ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలలో కూడా పెన్షన్ల ప్రభావం ఎక్కువగానే కనిపించింది. ఎలక్షన్ల ముందు వరకు వెయ్యి రూపాయలు మాత్రమే పెన్షన్ గా ఇస్తుండిన చంద్రబాబు, పాదయాత్రలో

మిగతా 3 లో...

## ఎన్డీఏలో బయటపడ్డ లుకలుకలు

### అవిశ్వాస తీర్మానానికి ఎన్డీయే భాగస్వామ్య పార్టీ మద్దతు



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

జాతీయ ప్రజాస్వామిక కూటమి (ఎన్డిఏ)లో లుకలుకలు బయటపడ్డాయి. ప్రతిపక్ష ఇండియా (ఎ.ఐ.ఆ.ఎ.ం) కూటమి ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి మద్దతివ్వాలని ఎన్డీయే భాగస్వామ్య పార్టీ మిజో నేషనల్ ఫ్రంట్ (ఓఔఈ) నిర్ణయించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ ప్రతిపాదించిన ఈ అవిశ్వాస తీర్మానంపై మంగళవారం నుంచి చర్చ జరుగుతోంది. ఎంఎన్ఎఫ్ ఎంపీ సీ లాల్రోసంగ గురువారం మీడియాతో మాట్లాడుతూ, తాను అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేస్తానని చెప్పారు.

మిగతా 2లో...

## మోదీ పాలనలో మెరుగైన స్థితిలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ

### దేశ ఆర్థిక వ్యవస్థపై ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ గురువారం లోక్ సభలో

మిగతా 2లో...

## ప్రజా వ్యతిరేకత సిట్టింగ్‌లను మార్చనున్న కేసీఆర్

### ఇంటెలిజెన్స్ నివేదికల ఆధారంగా సంచలన నిర్ణయం ?




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ విజయం సాధించాలంటే సిట్టింగ్ లలో అత్యధికులను మార్చక తప్పదా? అలా మార్చకుంటే కేసీఆర్ హ్యాట్రిక్ కల నెరవేరదా? అంటే బీఆర్ఎస్ శ్రేణులే ఔనని అంటున్నాయి. ఇంటెలిజెన్స్ రిపోర్టులన్నీ సిట్టింగ్ లపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందన్న నివేదికలే ఇచ్చాయని అంటున్నారు. కనీసంలో కనీసం 50 మంది సిట్టింగ్ లు తీవ్ర ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్నారనీ ఇంటెలిజెన్స్ నివేదికలతో కేసీఆర్ ఆలోచనలో పడ్డారని అంటున్నారు. కనీసం 50 నియోజక వర్గాలలో సిట్టింగులకు టికెట్ ఇస్తే విజయం కష్టమని నివేదికలు తేల్చేయడంతో కొత్త వారి కోసం అన్వేషణ మొదలైందని చెబుతున్నారు. సొంత పార్టీలో పోటీకి నేతలు కరవైన నియోజ కవర్గాలలో ఇతర పార్టీల్లో బలమైన నేతలను బీఆర్ఎస్ లోకి ఆకర్షించే వ్యూహాలు పన్నుతున్నారనీ అంటున్నారు. అమోఘ మైన అభివృద్ధి, అనితర సాధ్యమైన సంక్షేమ పథకాలు అమలు చేసినా తమ ప్రభుత్వం పట్ల ఇంత ప్రజా వ్యతిరేకత గూడు కట్టుకోవడమేమిటని తెరాస నేతలు ఆశ్చర్యపోతున్నారని చెబుతున్నారు. గత ఎన్నికల లో కంటే ఎక్కువ స్థానాలలో విజయం సాధిం చాలని ప్రణా ళికలు రూపొందిస్తున్న కేసీఆర్ కు ఇంటెలిజెన్స్ నివేదికలు షాక్ ఇచ్చాయని పార్టీ శ్రేణులే

మిగతా 2లో...

## చేసి చూపించడమే... మా ప్రభుత్వం



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

అవినీతి, బంధుప్రీతి ఉన్నందున యూపీఏ దశాబ్దం మొత్తం వృధా చేసిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. నేడు ప్రతి సంక్షోభం మరియు కష్టాలు అభివృద్ధి మరియు అవకాశంగా మార్చబడ్డాయి. బ్యాంకింగ్ రంగం ఆరోగ్యంగా ఉండాలని మేము గుర్తించాము. అందుకోసం అనేక చర్యలు తీసుకున్నాము. బ్యాంకులు రాజకీయ జోక్యం లేకుండా పని చేయగలవు, అవి వృత్తిపరమైన చిత్తశుద్ధితో పని చేస్తున్నాయి. బ్యాంకుల్లో విస్తరించిన మీ రైతును మేము శుభ్రం చేస్తున్నాము. పార్లమెంట్లో

మిగతా 2లో...

## మీ డిమాండ్ పరిశీలిస్తాం




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

గ్రూప్ 2 వాయిదా వేయాలన్న అభ్యర్థుల డిమాండ్పై తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ స్పందించింది. ప్రస్తుతం టీఎస్పీఎస్సీ ఛైర్మన్ అందుబాటులో లేనందున కార్యదర్శి ఓ ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థుల డిమాండ్లను పరిశీలిస్తామని తెలిపారు. వరుసగా వస్తున్న పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే టైం లేదని డిమాండ్ చేస్తూ గ్రూప్ 2 అభ్యర్థులు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఆగస్టు 29, 30న జరిగే గ్రూప్ 2 పరీక్షను వాయిదా వేయాలని కోరారు. టీఎస్పీఎస్సీ ఆఫీస్ ముట్టడికి యత్నించిన అభ్యర్థులతో నాంపల్లి పరిసర ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. భారీగా

మిగతా 2లో...

## కాంగ్రెస్‌లో వైఎస్ఆర్‌టీపీ విలీనం ఖాయమేనా!

### ■ పొత్తులతో సర్దుకుంటారా ■ ఈనెల 12న ఢిల్లీకి షర్మిల ?

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



మాజీ సీఎం వైఎస్ కుమార్తె, వైఎస్ఆర్టీపీ అధ్యక్షురాలు షర్మిల కాంగ్రెస్ తో కలవబోతున్నారా? షర్మిల తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేయబోతున్నారా? అంటే తెలంగాణ రాజకీయ వర్గాలలో అవునని గట్టిగానే వినిపిస్తుంది. షర్మిలను తమతో కలుపుకోవాలని కాంగ్రెస్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నదని చాలా కాలంగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే షర్మిల పార్టీ విలీనంపై ఆ మధ్య పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అప్పుడెప్పుడో షర్మిల పార్టీ విలీనంపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ రాయబారం నడుపుతున్నట్లు చెప్పుకున్నారు. షర్మిల తన పార్టీని విలీనం చేస్తే కర్ణాటక నుంచి రాజ్యసభకు పంపిస్తారని కూడా ప్రచారం జరిగింది. కానీ ఎందుకో అది అప్పట్లో ప్రచారంగానే ఉండిపోయింది. జులైలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి రోజున సోనియా, రాహుల్ గాంధీలు కడప జిల్లాలోని ఇడుపులపాయకు వస్తారని.. అక్కడ వారు విజయమ్మతో భేటీ కానున్నట్లు కూడా కాంగ్రెస్ వర్గాలలో ప్రచారం జరిగింది. అయితే, అది కూడా వర్క్ అవుట్ కాలేదు. కాగా, ఈసారి షర్మిల పార్టీ విలీనానికి ముహూర్తం ఖరారైందంటూ మరో సారి రాజకీయవర్గాలలో పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. ముందుగా షర్మిల సోనియా గాంధీతో సమావేశం కానున్నట్లు తెలుస్తుంది. ఈనెల 12వ తేదీన షర్మిల ఢిల్లీకి వెళ్ళి పార్టీఅగ్రనేత సోనియాగాంధీతో

మిగతా 2లో...

## టీఎస్‌పీఎస్‌సీ కార్యాలయం ముట్టడి



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ అభ్యర్థులు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాన్ని చుట్టుముట్టారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అభ్యర్థులకు ఓయూ జేఏసీ, టీపీసీసీ, టీజేఎస్ మద్దతు తెలిపాయి. టీఎస్పీఎస్సీ ఆఫీస్ ముట్టడికి వేలాదిగా విద్యార్థులు, అభ్యర్థులు తరలి వచ్చారు.

మిగతా 2లో...

## చంద్రుడి దగ్గరకు
# చంద్రయాన్...

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల మధ్య జరగనుంది. సోమవారం, ఇస్రో చంద్రయాన్-3 ఎత్తును దాదాపు 14 వేల కిలోమీటర్ల మేర తగ్గించింది. ఆగస్టు 16వ తేదీన చంద్రయాన్-3 100 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలోకి ప్రవేశించనుంది. ఆగస్టు 17న ల్యాండర్ (విక్రమ్), రోవర్ (ప్రజ్ఞాన్) లతో కూడిన ల్యాండింగ్ మాడ్యూల్ ప్రొపల్షన్ మాడ్యుల్ నుంచి విడిపోనుంది.ల్యాండింగ్ మాడ్యూల్ విడిపోయిన తర్వాత, ఇస్రో ల్యాండింగ్ మాడ్యూల్ ను పెరిలున్ (చంద్రునికి అత్యంత సమీపంలోని స్థానం) 30 కిలోమీటర్లు, అపోలూన్ (చంద్రునికి దూరమైన స్థానం) 100 కిలోమీటర్ల కక్ష్యలోకి డీ-బూస్ట్ చేస్తుంది. చివరి ల్యాండింగ్ ఈ కక్ష్య నుంచి జరగనుంది. అన్నీ అనుకున్న ప్రకారం జరిగితే ఈనెల 23న చంద్రయాన్ చంద్రుడిపై దిగుతుంది. చంద్రయాన్-3 ల్యాండర్ విక్రమ్, అన్ని సెన్సార్లు, దాని రెండు ఇంజిన్లు పని చేయకపోయినా ఆగస్టు 23న చంద్రుని ఉపరితలంపై సాఫ్ట్-ల్యాండింగ్ చేయగలదని ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ పేర్కొన్న విషయం తెలిసిందే. బెంగళూరులోని దిశా భారత్ ఎన్జీవో సంస్థ ఏర్పాటు చేసిన చంద్రయాన్-3: భారత్స్ ప్రైడ్ స్పేస్ మిషన్ కార్యక్రమంలో ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ పాల్గొని చంద్రాయన్-3 కి సంబంధించి కీలక విషయాలు వెల్లడించారు. చంద్రయాన్-3 ల్యాండర్ విక్రమ్, అన్ని సెన్సార్లు, దాని రెండు ఇంజిన్లు పని చేయకపోయినా ఆగస్టు 23న చంద్రుని ఉపరితలంపై సాఫ్ట్-ల్యాండింగ్ చేయగలదని అన్నారు. అన్ని రకాల వైఫల్యాలను తట్టుకునేలా ల్యాండర్ 'విక్రమ్' డిజైన్ చేశామన్నారు. ఇది ఫెయిల్యూర్ విధానంలో పని చేస్తుందన్నారు. అంతా విఫలమై, అన్ని సెన్సార్లు ఆగిపోయినా, ఏమీ పని చేయకపోయినా, ప్రొపల్షన్ సిస్టమ్ ఒక్కటి బాగా పనిచేస్తే విక్రమ్ ల్యాండింగ్ చేస్తుందన్నారు. ఫెయిల్యూర్ విధానంలో రూపొందించినట్లు చెప్పారు. జూలై 14న అంతరిక్షంలోకి దూసుకెళ్లిన చంద్రయాన్ ఆగస్టు 5న చంద్రుని కక్ష్యలోకి ప్రవేశించింది. దానిని చంద్రునికి దగ్గరగా తీసుకురావడానికి మరో మూడు డీ ఆర్బిటరీ విన్యాసాలు జరగాల్సి ఉంది. అన్ని కసరత్తుల తరువాత ఆగస్టు 23న చంద్రుని ఉపరితలంపై విక్రమ్ ల్యాండింగ్ అవుతుంది. ఆగస్టు 14, ఆగస్టు 16 తేదీల్లో నిర్వహించే డీ ఆర్బిటరీ విన్యాసాల ద్వారా చంద్రయాన్ చంద్రుడి నుంచి 100 కిమీలీ 100 కిమీల దూరం వరకు తగ్గిస్తారని సోమనాథ్ వివరించారు. ల్యాండర్ ప్రొపల్షన్ మాడ్యూల్ సెపరేషన్ ఎక్సర్‌సైజ్ ల్యాండర్ డీబూస్ట్ తర్వాత వెంటనే చేపడతామని, ఈ ప్రక్రియ ల్యాండర్ వేగాన్ని తగ్గిస్తుందన్నారు. ఆ తర్వాత ఆగస్టు 23న చంద్రుడి ఉపరితలంపై ల్యాండ్ అవుతుందని ఆయన వివరించారు. ఈసారి కూడా ల్యాండర్ విక్రమ్‌లో రెండు ఇంజన్లు పని చేయకపోయినా, ఇంకా ల్యాండ్ అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అల్గారిథమ్‌లు సరిగ్గా పనిచేస్తే విక్రమ్ అనేక వైఫల్యాలను విజయవంతంగా ఎదుర్కొంటుందని నిర్ధారించుకునేలా డిజైన్ చేసినట్లు ఆయన వివరించారు.

## మోదీ పాలనలో మెరుగైన స్థితిలో
# భారతదేశ ఆర్థిక వ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. 'వస్తాయి, అందుతాయి' అని ప్రజలు గత ప్రభుత్వాల హయాంలో ఆశించేవారని, ప్రస్తుతం 'వచ్చాయి. అందాయి' అని ప్రజలు అంటున్నారని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు ప్రజలు 'విద్యుత్తు వస్తుంది, వంటగ్యాస్ కనెక్షన్ వస్తుంది' అని ఎంతో ఆశతో చూసేవారని, ప్రస్తుతం విద్యుత్తు వచ్చింది, వంటగ్యాస్ కనెక్షన్ వచ్చింది అని ప్రజలు చెప్తున్నారని తెలిపారు. మోదీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చలో ఆమె మాట్లాడారు. 2013లో యూపీయే ప్రభుత్వం ఉన్నపుడు ప్రముఖ రేటింగ్ సంస్థ మోర్గాన్ స్టాన్లీ భారత దేశాన్ని ప్రపంచంలో బలహీన ఆర్థిక వ్యవస్థలుగల ఐదు దేశాల్లో ఒకటిగా వర్గీకరించిందని చెప్పారు. కానీ ప్రస్తుత మోదీ పాలనలో భారత దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగైన స్థితిలో ఉందని చెప్తూ, రేటింగ్‌ను అప్‌గ్రేడ్ చేసిందన్నారు. కేవలం తొమ్మిదేళ్లలో భారత దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందిందని, దీనికి కారణం ప్రభుత్వ విధానాలేనని చెప్పారు. కోవిడ్-19 మహమ్మారి వల్ల అనేక ఇబ్బందులు ఎదురైనప్పటికీ, దేశం ఆర్థికంగా వృద్ధి సాధిస్తోందన్నారు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలిచిందని చెప్పారు. భవిష్యత్తులో అభివృద్ధి సాధించడం గురించి మన దేశం ఆశాజనక స్థితిలో ఉందన్నారు.ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 2022లో కేవలం 3 శాతం వృద్ధి సాధించిందని, 2023లో ఇది 2.1 శాతానికి తగ్గుతుందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసిందని చెప్పారు. "అందరితో కలిసి, అందరి అభివృద్ధి, అందరి నమ్మకం, అందరి కృషి" అనే నినాదంతో మోదీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఇటువంటి వాటి ద్వారా ఆర్థిక విధానాలను మోదీ మెరుగుపరిచారని చెప్పారు. కోవిడ్ మహమ్మారి తర్వాత ఆర్థిక వ్యవస్థ కోలుకోవడానికి, వేగంగా వృద్ధి చెందడానికి ఇవన్నీ దోహదపడ్డాయన్నారు. ప్రత్యక్ష నగదు బదిలీ (ఆఐ) విధానం అంతర్జాతీయ సమాజానికి నమూనాగా నిలిచిందని చెప్పారు. 2013-14లో కేవలం రూ.7,367 కోట్లు డీబీటీ ద్వారా ప్రజలకు చేరాయని, 2014-15నాటికి ఇది ఐదు రెట్లు పెరిగిందని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.7.16 లక్షల కోట్లకు పెరిగినట్లు తెలిపారు.

# సిట్టింగ్‌లను మార్చనున్న కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

అంతర్గత సంభాషణల్లో చెబుతున్నాయి. ప్రస్తుతం అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 104. వీరిలో కనీసం 50 మంది తిరిగి పోటీ చేస్తే ఓటమి ఖాయమన్నది ఇంటెలిజెన్స్ నివేదికల సారాంశం. దీంతో ఆయా నియోజకవర్గాలలో కొత్త అభ్యర్థుల కోసం కేసీఆర్ అన్వేషణ ప్రారంభించినట్లు చెబుతున్నారు. అయితే ఇప్పుడే ఆయా నియోజకవర్గాలలో అభ్యర్థులను మార్చనున్నట్లు ప్రకటిస్తే మొదటికే మోసం వస్తుందన్న భయం బీఆర్ఎస్ అధినాయకత్వాన్ని వెంటాడుతోందని అంటున్నారు. ఆ కారణంగానే సిట్టింగులకే సీట్లు అని గతంలో చెప్పిన మాటను తప్పలేక, ఓటమి ఖాయమని నివేదికలు తేల్చేసిన సిట్టింగులను మళ్లీ పార్టీ అభ్యర్థులుగా నిలపేందుకు నిర్ణయం తీసుకోలేక సీఎం కేసీఆర్ సతమతమౌతున్నట్లు పార్టీ వర్గాలే చెబుతున్నాయి. ఆ నేపథ్యంలోనే సిట్టింగులను మార్చాల్సిన నియోజకవర్గాల ఇన్ చార్జ్ మంత్రులతో కేసీఆర్ వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. కాగా కొన్ని చోట్ల మంత్రులకే వ్యతిరేక పవనాలు వీస్తున్నట్లుగా నివేదికలు ఉండటంతో వారిని పక్కన పెట్టి కొత్త ఇన్ చార్జ్ లను నియమించాలన్న యోచన చేస్తున్నట్లు చెబుతున్నారు. కాగా టికెట్లు దక్కని సిట్టింగులను సముదాయించే పనిని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మంత్రి హరీష్ రావులకు కేసీఆర్ అప్పగిం చినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. క్షేత్ర స్థాయిలో పార్టీ పరిస్థితి ఇలా ఉంటే అసెంబ్లీ వేదికగా కేసీఆర్ మాత్రం ముచ్చటగా మూడో సారి అధికార పగ్గాలు చేపడతామన్న ధీమాను వ్యక్తం చేశారు. గత ఎన్నికలలో కంటే ఏడెనిమిది స్థానాలలో విజయం సాధించాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.

# కాంగ్రెస్‌లో వైఎస్ఆర్‌టీపీ విలీనం ఖాయమేనా!

(మొదటి పేజీ తరువాయి)

భేటీ అవుతారని చెబుతున్నారు. ఆ సమయంలోనే కాంగ్రెస్ పార్టీలో వైఎస్సార్టీపి విలీనం గురించి ప్రకటన వెలువడే అవకాశం కూడా ఉందని చెబుతున్నారు. కొంతకాలంగా షర్మిల పార్టీ విలీనం అవుతుందా? లేక పొత్తులతో ముందుకు వెళ్తారా అనే చర్చ అయితే విస్తృతంగా సాగుతుంది. మొదట్లో షర్మిల పొత్తుకు మొగ్గు చూపితే కాంగ్రెస్ నేతలు విలీనానికే పట్టుబట్టారు. అయితే రెండు పద్ధతుల్లో లాభనష్టాలను బేరీజు వేసుకున్న తరువాత షర్మిల కూడా విలీనానికే సిద్ధ పడ్డారని కాంగ్రెస్, వైఎస్సార్టీపీ వర్గాలు చెబుతున్నాయి. షర్మిల తరపున కాంగ్రెస్ పెద్దలతో తెలంగాణ నుండి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కర్ణాటక నుండి డీకే శివకుమార్ మాట్లాడుతుండగా.. ఈ భేటీతో ఈ వ్యవహారం ఒక కొలిక్కి వచ్చే ఛాన్స్ ఉందని పరిశీలకులు చెబుతున్నారు. కాంగ్రెస్ లో వైఎస్సార్టీపీ విలీనం చేసేయాలని.. అందుకు ప్రతిఫలంగా ఆమెని రాజ్యసభకి పంపించడం.. కావాలంటే ఏపీలో కాంగ్రెస్ బాధ్యతలు కూడా షర్మిలకే అప్పగించడం వంటి ప్రతిపాదనలు కాంగ్రెస్ నుంచి వస్తున్నాయని అంటున్నారు. కాంగ్రెస్ తో పొత్తుకి వస్తామని.. అది కూడా కేవలం తెలంగాణలోనే తన ప్రమేయం ఉంటుందని షర్మిల చెబుతున్నారని అంటున్నారు. మరి ఈ రెంటిలో ఏది ఫైనల్ అవుతుంది? కాంగ్రెస్ షర్మిలను విలీనానికి ఒప్పించగలుగుతుందా? ఒకవేళ షర్మిల ఒకే అంటే ఆమె ఏపీకి వెళ్తారా.. తెలంగాణలోనే ఉంటారా అన్నది ఈ భేటీతో తేలే అవకాశం కనిపిస్తుంది. నిజానికి షర్మిలను ఏపీ అధ్యక్షురాలిగా చేసి పార్టీ పగ్గాలను అప్పగించాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. అలాగే ఆమెకు ఏపీ పార్టీ పగ్గాలు అప్పగిస్తే ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతం అవుతుందని నమ్ముతోంది. అయితే అందుకు షర్మిల అంగీకరించలేదనీ, తాను తెలంగాణకే పరిమితమౌతానని భీష్మించారనీ గతంలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. తన రాజకీయం ఇక తెలంగాణలో అంటూ షర్మిలనే స్వయంగా చెప్పిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో మరో మూడు రోజులలో కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీతో షర్మిల భేటీ కానున్నట్లు వస్తున్న వార్తలతో వైఎస్సార్టీపీ, కాంగ్రెస్ ల మధ్య విలీనంపై ఒక అవగాహన కుదిరిందనే భావించాల్సి ఉంటుంది. కాగా, తెలంగాణ కాంగ్రెస్ లో ఒక వర్గం షర్మిల రాకను ఆహ్వానిస్తుంటే మరొక వర్గం ఆమెని ఏపీకి వెళ్లి రాజకీయం చేసుకోమని బహిరంగంగానే చెప్తున్నారు. ఇక పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కూడా ఒక సందర్భంలో తాను ఉన్నంత వరకూ కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాలలో షర్మిల వేలు కూడా పెట్టలేరని అన్నారు. ఆమె ఏపీలో రాజకీయం చేస్తే తెలంగాణ పీసీసీ అధినేతగా తాను ఆమెతో చర్చలు జరుపుతానని అన్నారు.మరి ఇప్పుడు సోనియా గాంధీతో షర్మిల భేటీ అనంతరం షర్మిల పార్టీ కాంగ్రెస్ లో విలీనం, ఆమె పార్టీలో చేపట్టబోయే బాధ్యతలపై స్పష్టత వస్తుందని అంటున్నారు. అన్నిటికీ మించి షర్మిలకు ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు అప్పగించడం ద్వారా వైసీపీని దెబ్బతీయాలన్నది కాంగ్రెస్ హై కమాండ్ ఉద్దేశంగా చెబుతున్నారు. ఏపీలో కాంగ్రెస్ ప్రస్తుత పరిస్థితికి జగన్ రాజకీయమే కారణమని కాంగ్రెస్ అగ్రనాయకత్వం గట్టిగా నమ్ముతోంది. షర్మిలకు ఏపీ బాధ్యతలు అప్పగిస్తే జగన్ కు అది కచ్చితంగా ప్రతికూలంగా మారి వైసీపీకి పూడ్చుకోలేని నష్టం చేకూరుస్తుందని కూడా భావిస్తోంది?

# చేసి చూపించడమే... మా ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

అవిశ్వాస తీర్మానంపై చర్చ మొదలు పెట్టారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. ఇప్పటికే కేంద్రమంత్రులు అమిత్షా, స్మృతి ఇరానీ యూపీఏని టార్గెట్ చేస్తూ విమర్శలు చేయగా...సీతారామన్ కూడా తనదైన శైలిలో సెటైర్లు వేశారు. చేస్తాం, చూస్తాం అనే రోజులు పోయాయని, మోదీ హయాంలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నామని స్పష్టం చేశారు. 2014కి ముందు భారత్ ఆర్థిక వ్యవస్థ దారుణంగా ఉండేదని, ఇప్పుడు ఇదే భారత్ ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని తేల్చి చెప్పారు. ఈ సమయంలోనే మోర్గాన్ స్టాన్లీ ఇచ్చిన రిపోర్టును ప్రస్తావించారు. కొవిడ్ సంక్షోభం సవాలు ఎదురైనా అధిగమించి మరీ ఆర్థికంగా ముందుకెళ్లగలిగామని వెల్లడించారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్దేనని తెలిపారు నిర్మలా సీతారామన్. "చేస్తాం, చూస్తాం లాంటి పదాలు ఇకపై వినపడవు. ఇప్పుడు భారత దేశ ప్రజలందరూ ఆ పదాలను మరిచిపోయారు. ఇప్పుడంతా కొత్త పదాలు వినిపిస్తున్నాయి. "వచ్చేసింది, అయిపోయింది" అని ధీమాగా చెబుతున్నారు. యూపీఏ హయాంలో "కరెంట్ వస్తుంది" అని చెప్పారు. కానీ మోదీ హయాంలో "కరెంట్ వచ్చేసింది" అని ప్రజలు చెప్పుకుంటున్నారు. అప్పట్లో గ్యాస్ కనెక్షన్ వస్తుంది అని ఎదురు చూసే వాళ్లు. ఇప్పుడు గ్యాస్ కనెక్షన్ వచ్చేసింది అని ఆనందంగా చెబుతున్నారు. ఎయిర్‌పోర్ట్ వస్తుంది అని యూపీఏ హయాంలో చెప్పి వదిలేస్తే...ఇప్పుడు మాత్రం ఎయిర్ పోర్ట్ వచ్చేసింది అని చర్చించుకుంటున్నారు" మార్పు మాటల్లో కాదని, చేతల్లో చూపించాలని యూపీఏపై సెటైర్లు వేశారు నిర్మలా సీతారామన్. ప్రజలకు కేవలం అరచేతిలో వైకుంఠం చూపించి మోసం చేశారని మండి పడ్డారు.

వాళ్లు కన్న కలలన్నింటినీ తమ ప్రభుత్వం నిజం చేసిందని తేల్చి చెప్పారు. "దేశంలో మార్పు వచ్చేది కేవలం చేతలతోనే తప్ప మాటలతో కాదు. మీరు (యూపీఏని ఉద్దేశిస్తూ) ప్రజలకు ఎన్నో ఆశలు చూపించి వదిలేశారు. మేం మాత్రం వాళ్ల ప్రతి కలనూ నెరవేరుస్తున్నాం. ఏ వర్గాన్నీ వదలకుండా ప్రజలందరికీ సంక్షేమం అందాలన్నదే మా ఉద్దేశం. అదే నిజమైన సాధికారత అని అన్నారు.

# తెలంగాణలో పింఛన్ రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)

పాదయాత్రలో భాగంగా జగన్మోహన్ రెడ్డి 2000 ఇస్తాననడంతో ఆ హామీ ద్వారా తనకు జరగగల నష్టాన్ని ఊహించుకుని, తానే పెన్షన్ 2000 చేసేసారు. ఆ తర్వాత పెన్షనును తాను 3000 చేస్తానంటూ జగన్ హామీ ఇచ్చారు. ప్రజలు నమ్మారు. చంద్రబాబు పెన్షన్ పెంచడం కూడా జగన్ పుణ్యమే అని ప్రజల విశ్వసించారు. ఫలితంగా ఆయనకు అధికారం కట్ట బెట్టారు. ఆ మాట ఆయన నిలబెట్టుకున్నారు కూడా.ఇప్పుడు తెలంగాణలో ఇలాంటి పెన్షన్ రాజకీయమే నడుస్తోంది. 3000 రూపాయల పెన్షన్లు ప్రస్తుతం అందుతుండగా తమ ప్రభుత్వం వస్తే వాటిని 4000 చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇలాంటి హామీ ప్రజలను ప్రభావితం చేస్తుందనే సంగతి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు బాగా తెలుసు. అయినా ఆయన చంద్రబాబు లాగా కంగారుపడి తన అధికారంలో ఉన్నాను గనుక ఇప్పుడే పెన్షన్ 4000 చేసేద్దాం అని అనుకోవడం లేదు. తాను ఐదు వేలు చేస్తానంటూ పాట పెంచారు. కాకపోతే ఆ విషయాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటిస్తాం అన్నారు. దాని అర్థం ఎన్నికల తర్వాత మళ్లీ నెగ్గితే మాత్రమే పెన్షన్ పెంచుతానని చెబుతున్నట్టుగా తెలుసుకోవాలి.ఇంకా ఎన్నికల నగారా మోగక ముందే కేసీఆర్ పాట పెంచి 5000 ప్రకటిస్తున్నారు గనుక, కాంగ్రెస్ పార్టీ కూడా 5000 ప్రకటిస్తుందో.. లేదా, ఎన్నికల సమయానికి పాట పెంచుతుందో వేచి చూడాలి. తమాషా ఏంటంటే కాంగ్రెస్ భారాస రెండు కూడా జాతీయ పార్టీలైన నేపథ్యంలో ఇక్కడ అధికారంలోకి రావడానికి ఎలాంటి అతిశయమైన హామీలను ప్రకటిస్తారో అవే హామీలను వారు దేశంలోని ఇతర ప్రాంతాలలో కూడా ప్రకటించాల్సి ఉంటుంది. ఆ రకంగా చూస్తే కాంగ్రెస్ ఇరకాటంలో పడుతుంది. ఇక్కడ ఇచ్చే హామీని ప్రస్తుతం వారు అధికారంలో ఉన్న ఇతర రాష్ట్రాలలో అమలు చేసి చూపించమని ప్రజలు అడిగితే అది వారికి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టే.

## ఎన్డీఏలో బయటపడ్డ
# లుకలుకలు

(మొదటి పేజీ తరువాయి)

మణిపూర్‌లో హింసాకాండను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని చెప్పారు. అందుకే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. దీనినిబట్టి తాను కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నానని కానీ, బీజేపీని వ్యతిరేకిస్తున్నానని కానీ భావించరాదన్నారు. ప్రభుత్వాలు, మరీ ముఖ్యంగా మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్రంలో పరిస్థితిని చక్కదిద్దడంలో విఫలమైందన్నారు.మణిపూర్‌లోని జో ప్రజల పరిస్థితి తమను తీవ్రంగా కలవరపరుస్తోందన్నారు. ఈ సమస్యపై తాను తమ పార్టీ అధ్యక్షుడు, మిజోరాం ముఖ్యమంత్రి జొరాంతంగతో మాట్లాడానని చెప్పారు. తమ పార్టీ నేతలంతా అవిశ్వాస తీర్మానానికి మద్దతివ్వడంపై ఏకాభిప్రాయం వ్యక్తం చేశారన్నారు.బీజేపీ నేతృత్వంలోని నార్త్ ఈస్ట్ డెమొక్రాటిక్ అలయెన్స్ (ఔఇఆం)లోనూ, కేంద్రంలోని ఎన్డీయేలోనూ ఎంఎన్ఎఫ్ భాగస్వామి. ఎంఎన్ఎఫ్ రాజ్యసభ సభ్యుడు కే వన్లల్వేనా మాట్లాడుతూ, మణిపూర్ పరిస్థితిని చక్కదిద్దడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని పార్లమెంటులో ఎండగట్టడాన్ని కొనసాగిస్తానని తెలిపారు.

## మీ డిమాండ్
# పరిశీలిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిన అభ్యర్థులు వారికి మద్దతు పలికిన రాజకీయా పార్టీల అనుచరులతో ఆప్రాంతం ఒక్కసారిగా వేడెక్కింది. ఆ రూట్లో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో కొందరు అభ్యర్థులను పోలీసులు అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు. రాజకీయ పార్టీల నాయకులను కూడా అరెస్టు చేసి స్టేషన్కు తరలించారు. దీన్ని అభ్యర్థులు వ్యతిరేకిస్తూ పోలీసులతో ఘర్షణకు దిగారు. పరిస్థితి మరింత హాట్గా మారడంతో టీఎస్పీఎస్సీ అధికారులు స్పందించాల్సి వచ్చింది. కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న అభ్యర్థులకు నాయకత్వం వహిస్తున్న కొందరు నాయకులను పిలిచి మాట్లాడారు. వారితో చర్చించి పరిస్థితి వివరించారు. వారిని శాంతింపజేసి అక్కడి నుంచి పంపేశారు. విద్యార్థులతో మాట్లాడిన అనంతరం టీఎస్పీఎస్సీ కార్యదర్శి అనిత రామచంద్రన్ ఓ ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థుల నుంచి వినతిపత్రం తీసుకున్నామని అందులో తెలిపారు. వారి విన్నపాలను పరిశీలిస్తామన్నారు. దీనిపై చర్చించి నిర్ణయం తీసుకోవడానికి రెండు రోజుల సమయం పడుతుందని వివరించారు. ప్రస్తుతానికి గ్రూప్ 2 పరీక్ష వాయిదా పడలేదని స్పష్టం చేశారు అనిత రామచంద్రన్. దీనిపై టీఎస్పీఎస్సీ స్పష్టమైన ప్రకటన చేస్తుందని అంత వరకు తప్పుడు సమాచారాన్ని నమ్మొద్దని అభ్యర్థులకు సూచించారు.

# టీఎస్‌పీఎస్‌సీ కార్యాలయం ముట్టడి

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయం ముందు బైఠాయించారు. ప్రిపరేషన్కు తమకు టైం సరిపోవడంలేదని అందుకే గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులతో మాట్లాడిన అధికారులు చర్చలకు ఆహ్వానించారు. విద్యార్థి సంఘాలను ఆఫీస్లోకి పిలిచి వారితో చర్చిస్తున్నారు. ప్రస్తుతానికి ఆందోళన విరమించాలని వారికి సర్ది చెబుతున్నారు. ఒకేసారి అన్ని నోటిఫికేషన్లు ఇచ్చిన ప్రభుత్వం తమకు ప్రిపేర్ అయ్యే టైం కూడా ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులు ఇప్పటికే వివిధ రాజకీయపార్టీల మద్దతు కోరాయి. ప్రతిపక్షాలన్నీ కూడా వారికి మద్దతు ప్రకటించాయి. ప్రస్తుతం చేపట్టిన ఆందోళలో కాంగ్రెస్, టీజేఎస్ కూడా పాల్గొనడంతో ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ప్రస్తుతం తెలంగామలో గురుకుల, జేఎల్, డీఎల్ పరీక్షలు జరుగుతున్నాయి. వచ్చే నెలలో టెట్ ఉంది. ఈలోపే అంటే ఆగస్టు 29, 30 తేదీల్లో గ్రూప్ 2 పరీక్ష రాయాల్సి ఉంది. వరుస ఈ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు గ్రూప్ 2 పరీక్ష ప్రిపేర్ అయ్యేందుకు సమయం సరిపోదని అందుకే వాయిదా వేయాలని కోరుతున్నారు అభ్యర్థులు. గ్రూప్ 2 పోస్టులకు 5,51,943 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఒకే నెలలో గ్రూప్ ? 2, గురుకుల పరీక్షల నిర్వహిస్తున్నారనీ, సిలబస్ కూడా వేర్వేరని పేర్కొన్నారు. ఏదో ఒక పరీక్షకు మాత్రమే సన్నద్ధం కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీని వల్ల తమకు అర్హతలున్నప్పటికీ అవకాశాన్ని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా గ్రూప్ -2 పరీక్షకు ఆగస్టు 29, 30 తేదీలను ఖరారు చేశారు. ఆగస్టు 1 నుంచి 23 వరకు గురుకుల బోర్డుకు సంబంధించిన పరీక్షలు జరుగుతున్నాయి. గ్రూప్ 2 పరీక్షలోని మూడో పేపర్ అయిన ఎకానమీలో అదనంగా 70 శాతం సిలబస్ కలిపారని, సన్నద్ధతకు కేవలం ఒక్క బుక్ మాత్రమే విడుదల చేశారని వాపోయారు. పేపర్ లీకేజీ ఘటనతో సరిగా చదవలేకపోయామని, ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని గ్రూప్ 2 పరీక్షను 3 నెలలు వాయిదా వేయాలని బోర్డును కోరారు.ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. గ్రూప్ 2 వాయిదాపై ప్రభుత్వం ఆలోచన చేయాలని కోదండరాం అన్నారు. నిరుద్యోగులు అడిగేది న్యాయమైన డిమాండ్ అని, మూడు వేల నిరుద్యోగ భృతి అడగటం లేదని కేవలం మూడు నెలల గడువు మాత్రమే అడుగుతున్నారని అన్నారు. ఏడేళ్ల ఆగిన ప్రభుత్వం, మూడు నెలలు ఆగలేదా? అంటే ఎన్ఎస్యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ప్రశ్నించారు.

## క్విట్ ఇండియా ఉద్యమం పై విద్యార్థులకు అవగాహన...



కమాన్‌పూర్ - ప్రభాత సూర్యుడు

రామగుండం కార్పొరేషన్‌లోని శ్రీరామ విద్యానికేతన్ అడ్డగుంటపల్లిలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. శాంతి స్థాపన కోసం అలుపెరుగని సైనికుడిలా పనిచేస్తున్న నేషనల్ యూత్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ యాదవ రాజు అధ్యక్షతన తన జరిగిన ఈ కార్యక్రమంలో సామాజికవేత్త. వ్యక్తిత్వ వికాస శిక్షకులు. తెలంగాణ ఉద్యమ నేత దళితరత్న దేవీ లక్ష్మీనరసయ్య... మాట్లాడుతూ విద్యార్థులకు అహింసా మార్గమే ఈ దేశానికి రక్షణ ఎంతోమంది పోరాడిన ఇంతమంది జీవితాలు త్యాగం చేసిన శాంతి అహింసమార్గం ద్వారానే బ్రిటిష్ వారిని వెలగట్టడం జరిగిందని.. క్విట్ ఇండియా ఉద్యమమును స్ఫూర్తిగా తీసుకొని మీలో కూడా బద్ధకాన్ని సోమరితనాన్ని వదిలివేసి బాగా చదువుకోవాలని గొప్ప వాళ్ళ స్ఫూర్తి గా చదవాలని చెప్పడం జరిగింది. ఆదివాసి దినోత్సవం పురస్కరించుకొని వారి గురించి కూడా తెలియజేయడం జరిగింది. ముందుగా అమరుడైన ప్రజాయుద్ధనౌక గద్దర్ ఫోటోకు నివాళు లర్పిస్తూ ఆయన గురించి కూడా చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మీవాని. స్నేహ సాహితీ గ్రంథాలయం ఏలేశ్వరం వెంకటేష్. శ్రీరామవిద్యానికేతన్ కరస్పాండెంట్ వెంకటేశ్వరరావు జ్యోతి ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కరీంనగర్లో ఎన్ఐఏ సోదాలు

కరీంనగర్- ప్రభాత సూర్యుడు

జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కరీంనగర్ నగరంలో సోదాలు నిర్వహించడం కలకలం రేపింది. కరీంనగర్ హుస్సేన్ పురాలో గురువారం తెల్లవారుజాము ఐదు గంటలనుంచి ఎన్ఐఏ బృందం తనిఖీలు చేపట్టింది. దుబాయి లో వుంటున్న స్థానికుడు తబ్రేజ్ ఖాన్ అనే వ్యక్తికి పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా ( పీఎఫ్ఐ) అనే నిషేధిత సంస్థతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో సోదాలు జరిపింది. దాదాపు నాలుగు గంటలపాటు తకిఖీలు జరిపిన ఎన్ఐయే బృందం తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయింది. తనిఖీలో కొన్ని కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

## నేటి ఉరుసు గంధం మహోత్సవం విజయవంతం చేయండి

మంథని - ప్రభాత సూర్యుడు

బాబా తాజోద్దీన్ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రోజున 101వ ఉరుసు గంధం మహోత్సవం నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకులు ఎస్ ఎం అజార్ అలీ తెలిపారు. ఉరుసు గంధం మహోత్సవం సందర్భంగా మంథని పట్టణంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ఉరుసు గంధం మహోత్సవాన్ని విజయవంతం చేయాలని అధ్యక్షులు బుర్ధర్తి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మహమ్మద్ ఐసాన్, తోటపల్లి రాజబాపు, ప్రధాన కార్యదర్శి తనుగుల లక్ష్మణ్, మహమ్మద్ జకిర్‌సంయుక్త కార్యదర్శి సయ్యద్ అస్లం, బజారు మహేందర్, కోశాధికారి ముప్పిడి శ్రీనివాస్, కాల్వ శ్రీకాంత్, మహమ్మద్ సాకీర్, నక్కరాజు లు కోరారు.

## బిఆర్ఏఓయులో ప్రవేశాలకు గడువు పెంపు



పెద్దపల్లి- ప్రభాత సూర్యుడు

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశానికి ఈ నెల 16 వరకు గడువు పొడిగించి నట్లు పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కోన లక్ష్మీ నరసయ్య, సమన్వయకర్త డాక్టర్ వంగల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ఇది ఒక సువర్ణ అవకాశమని ఇంటర్మీడియట్, డిప్లొమా, రెండు సంవత్సరముల ఐటిఐ కోర్స్, నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా సీనియర్ ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులందరూ డిగ్రీలో ప్రవేశానికి అర్హులని తెలిపారు. రెండు సంవత్సరాల ఐటిఐ పూర్తి చేసిన విద్యార్థులకు రెగ్యులర్ డిగ్రీ విద్యను అభ్యసించే అవకాశం లేదని, వారికి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా మాత్రమే అవకాశం ఉందని, అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. అలాగే అంబే ద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా ఎంబీఏలో ప్రవేశం పొందడానికి ఐసెట్ రాయని, ఐసెట్ ఉత్తీర్ణు లు కానీ అభ్యర్థుల కోసం యూనివర్సిటీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుందని, పరీక్ష కోసం ఈనెల 20 లోపు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు ఈ కోర్సులలో ప్రవేశం కోసం బిఆర్ఏ ఓయు ఆన్లైన్ డాట్ ఇన్ వెబ్సైట్ సందర్శించాలని లేదా పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అధ్యయన కేంద్రాన్ని లేదా ఈ 7382929654 నంబర్ సంప్రదించాలని కోరారు.

# గద్దర్‌కి నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు

కమాన్‌పూర్ - ప్రభాత సూర్యుడు



రామగిరి మండలం సెంటినరీ కాలనీలో ప్రజా యుద్ధనౌక గద్దర్ కు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాల మేరకుసెంటనరికాలనీ టౌన్ అధ్యక్షుడు కాటం సత్యం ఆధ్వర్యంలో రామగిరి మండల కేంద్రం సెంటనరికాలని అంబేద్కర్ చౌరస్తా నుండి తెలంగాణ చౌరస్తా వరకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు,ప్రజా యుద్ధ నౌక గద్దర్ కి కోవ్వత్తులతొ ఘన రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులు అర్పించారు.. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులు రామగిరి మం డలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట చంద్రయ్య, మంథని అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్, కాలేశ్వరం మాజీ డైరెక్టర్ మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్, పన్నూర్ ఎంపీటీసీ కొప్పుల గణపతి, రామ గిరి మండలం కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు దాసరి శివ, బీసీ సెల్ అధ్యక్షుడు బండారి సదానందం, ఎస్ సి సెల్ మండలం అధ్యక్షుడు, మంథని రవీందర్, రామగిరి మండలం కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రాధారెడ్డి, ఉమాదేవి, మల్లే శ్వరి, లొంక కేసారం గ్రామ శాఖ అధ్యక్షుడు వీర వేని శ్రీనివాస్ ఐఎ న్‌టియుసి నాయకులు పి వి గౌడ్, మ్రెరి ఓదెలు, డి మంగయ్య,సందెల కుమార్, సర్వన్ నాయక్, జుబేర్, ఉయ్యాల కుమారస్వామి గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మడ్డి రాజ కు మార్, సిద్ధం రామ నారా యణ సిద్ధం మురళి కృష్ణ, తాటి సతీష్, గాజుల భూ మయ్య, రామగిరి మండలం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా శ్రీధర్ వీణ, మోతుకూరి నవీన్, గుగ్గులోతు ప్రవీణ్, జాగరి రమేష్, గౌరీరెడి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సేవ చేయాలన్న సంకల్పానికి రాత్రి పగలు తేడా లేదు

## టీపీసీసీ పిలుపు మేరకు మైలారం గ్రామంలో నాగా సీతారాములు పల్లెనిద్ర

కొత్తగూడెం - ప్రభాత సూర్యుడు



సంకల్ప బలం గొప్పదైతే చేపట్టి కార్యం ఎంత కష్టమైన అవలీలగా అధిరోహించవచ్చు. సేవ చేయాలన్న నా సంకల్ప బలానికి రాత్రిపగలు తేడా లేనే లేదంటూ ముందుకు సాగుతున్నారు టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా టీపీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు కొత్తగూడెం నియోజకవర్గం, లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని మైలారం గ్రామపంచాయతీలోని సరియం రామారావు ఇంట్లో పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా గిరిజన కుటుంబాలను ఆయన ఇంటింటికి తిరిగి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని స్వయంగా వడ్డించారు. అనంతరం వారితో కలసి భోజనం చేశారు. పల్లెనిద్ర కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు మాట్లాడుతూ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను నీటిని నెరవేర్చిన సందర్భాలను ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులు సైతం కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడతామని కాంగ్రెస్ చేసిన మేలు మరి ఏ పార్టీ చేయలేదంటూ గ్రామస్తులు టిపిసిసి నాగా సీతారాములు దృష్టికి తీసుకువచ్చారు. రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో బలమైన శక్తిగా ఆవిర్భవించబోతుందంటూ ఆయన కితాబిచ్చారు. నాగా సీతారాములు చేపట్టిన పల్లెనిద్ర కార్యక్రమానికి స్థానిక నాయకులు, కార్యకర్తలు సైతం కష్టం అనుకోకుండా పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తున్న తీరు పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు కొత్తగూడెం నియోజకవర్గంలో ఒక బలమైన నాయకుడైన నాగా సీతారాములు అడుగుజాడల్లో మేము సైతం నడవడానికి సిద్ధంగా ఉన్నామంటూ వారు పేర్కొన్నారు. చాలా మందికి అవకాశం ఇచ్చాం ఈసారి మా ఎమ్మెల్యేగా నిన్ను గెలిపించుకుంటామంటూ వారు నినాదాలు చేయడం పట్ల పార్టీ కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఊకంటి గోపాలరావు, తూము.చౌదరి,గ్రామ సర్పంచ్ మాడె సుజాత, ఆదివాసి జిల్లా అధ్యక్షులు కోటేశ్వరరావు, మండల అధ్యక్షులు పర్సా నరసింహారావు పటేల్, వంకా గోపాలరావు దొర, తాటి నరసింహారావు, పెద్దమనిషి కుంజా లక్ష్మీనర్సు, కారం జనార్దన్, సూర్య నారాయణ, మాడే బాబు, మాడే వెంకటేశ్వర్లు, కిసాన్ కాంగ్రెస్ లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షులు మందా మల్లేష్, ఓబీసీ మండల అధ్యక్షులు బి . వీరబాబు, జుత్తు శ్రీనివాస్, బొల్లం.రామయ్య, ప్రభాకర్, కిషన్, ప్రసాద్, నాగేష్,యువజన కాంగ్రెస్ నాయకులు బొల్లం ఉదయ్, సాగర్, శేఖర్, మహేష్, సుధాకర్, నరేష్, పండు, అజ్జు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం ఇచ్చిన వరం గొర్రెలు పథకం

## 12 మంది లబ్ధిదారులకు పంపిణీ

కమాన్‌పూర్ - ప్రభాత సూర్యుడు

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో ముఖ్య మంత్రి కేసీఆర్ ప్రకటించిన గొర్రెలను గురువారం సర్పంచ్ పల్లె ప్రతిమ ఆధ్వర్యంలో ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య, జడ్పీటీసీ మ్యాదరవేన.శారదా కుమార్ అందచేసారు. గతంలో రత్నాపూర్ లో మొదటి ఫేస్ కింద 55 యూనిట్ల గొర్రెలను అంద జేయడం జరిగింది. రెండవ విడతలో 72 మంది లబ్ధిదారులు ఉండగా, 43 మంది లబ్ధిదారులు రూ. 43,750/- చొప్పున డీ.డీలు చెల్లించారు. దీనిలో ప్రభుత్వం రూ. 1,31,250/- లు సబ్సిడీ క్రింద చెల్లించింది. దీనిలో ఒక్కొక్క లబ్ధిదారునికి 20 గొర్రెలు, ఒక్క పొట్టేలును అందించడం జరిగింది. లబ్ధిదారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాచర్ల నుండి వీటిని కొనుగోలు చేసుకొని వచ్చారు. లబ్ధిదారులు జక్కుల సదయ్య, ఉడుత సతీష్, మేకల శ్రీనివాస్, మేకల రాంచందర్ , మండల వెంకటి, మెడగొండ రవి కుమార్, కోడారి కుమార్, సల్పాల అనిల్ కుమార్, జక్కుల సతీష్, జక్కుల శ్రీనివాస్, ఎలుక నర్సయ్య, సందవెన సంతోష్ కుమార్ లకు గొర్రెలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పశు వైద్యధికారి యారవ.దుర్గ ప్రసాద్ రెడ్డి,మండల యాదవ సంఘం అధ్యక్షులు బుద్ధుల తిరుపతి, సెక్రటరీ పెండ్లి రమ్య, టీఆర్ ఎస్ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్,ఓర్రె సురేష్, ఎలుక గట్టయ్య , జక్కుల ఆశాలు, మేకల ఓదెలు,మండల శంకర్, వెటర్నరీ అసిస్టెంట్ అత్తే మల్లికార్జున్, గోపాల మిత్ర జక్కుల శ్రీనివాస్,సోమరపు కనకయ్య తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసిన సర్పంచ్

కమాన్‌పూర్ - ప్రభాత సూర్యుడు



పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం ముస్త్యాల గ్రామ సర్పంచ్ రామగిరి లావణ్య నాగరాజు ఆధ్వర్వంలో సుందిళ్ల మరియు ముస్త్యాల స్కూళ్ళ లోని విద్యార్థులకు అరటి పండ్లు పంపిణీ చేయడం జరిగింది.సర్పంచ్ మాట్లడుతూ నా చిన్న తనం లోనే నాన్న కన్నం బొందయ్య చనిపోవడం జరిగిందనీ మరియు మా అత్తమ్మ రామగిరి నంబమ్మ చనిపోవడం జరిగిందనీ అన్నారు .. వాళ్ళ జ్ఞాపకంగా సేవ కార్యక్రమాలు చేయడంతో జరుగుతుందని సర్పంచ్ అన్నారు. మరియు సర్పంచ్ మాట్లాడుతు ప్రతి బుధవారం సుందిళ్ళ గ్రామంలో తొమ్మిది స్కూల్లో అరటిపళ్ళు పంపిణీ చేయడం జరుగుతుందని సర్పంచ్ అన్నారు మరియు ముస్త్యాల గ్రామం లో నాలుగు స్కూల్లో అరటి పండ్లు పంపిణీ చేయడం జరుగుతుందని సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్త్యాల సుందిళ్ల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యేకు చేదు అనుభవం

యాదాద్రి- ప్రభాతసూర్యుడు

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో 9 వ వార్డు లో 2 కోట్ల రూపాయల నిధులతో నిర్మిస్తున్న దోబి ఘాట్ శంకుస్థాపనకు వచ్చిన ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కి చేదు అనుభవం ఎదురయింది. శిలాఫలకం నిర్మించక పోవడం తో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మున్సిపల్ అధికారులపై ఆగ్రహించి వెనుదిరిగారు.

## ఎమ్మార్వో కార్యాలయలముందు రద్దీ

యాదాద్రి- ప్రభాతసూర్యుడు

యాదాద్రి భువనగిరి జిల్లాలో గృహలక్ష్మి కష్టాలు అన్నీ కావు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట బారులు తీరారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే ఆదాయము మరియు కులం సర్టిఫికెట్ కోసం బారులు తీరడం జరిగింది. మీ సేవలో దరఖాస్తు చేసుకున్న తర్వాత ఆ కాగితాలను ఎమ్మార్వో కార్యాలయంలో ఇవ్వాల్సి ఉంది దీంతో మండల వ్యాప్తంగా ఉన్న నిరుపేదలు ఒక్కసారిగా ఎమ్మార్వో కార్యాలయం వద్దకు రావడంతో సందడిగా మారింది..

## కొత్తగూడెంలో సినిమా ఫక్కీలో వివాహిత కిడ్నాపింగ్

కొత్తగూడెం- ప్రభాత సూర్యుడు

కొత్తగూడెంలో సినిమా ఫక్కీ లో వివాహిత కిడ్నాపింగ్ జరిగింది. భర్తపై దాడిచేసి భార్యను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఖమ్మం నగరానికి చెందిన దూలగొండ సన్నీ , కొత్తగూడెం నగరానికి చెందిన గొగ్గెల మాధవి దంపతులు, ఇటీవలే ప్రేమవివాహం చేసుకు న్నారు. భార్యను ప్రాజెక్టు వర్కు నిమిత్తం ఖమ్మం నుంచి కొత్తగూడెం కళాశాలకు ఆటోలో తీసుకెళుతుండగా మార్గమధ్యంలో కారులో దుండగులు ఛేజ్ చేసి యువకుడిపై దాడిచేసారు. యువతిని బలవంతంగా కార్లో ఎత్తుకెళ్లారు. కులాంతర ప్రేమ వివాహం కారణంగానే తనపై దాడిచేసి తన భార్యను కిడ్నాప్ చేశారని బాధిత యువకుడు ఆరోపించారు. తనకూ, తన భార్యకు ప్రాణహాని ఉందంటూ బాధితుడు చుంచుపల్లి పోలీసులను ఆశ్రయించాడు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215